ప్రజాశక్తి
సోమవారం 7 అక్టోబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సామ్రాజ్యవాదంపై పోరాడడం ద్వారా..

లెనిన్ వారసత్వాన్ని నిలబెట్టాలి

- సమసమాజ నిర్మాత లెనిన్ శత వర్ధంతి సభలో వక్తలు
- ఉత్తేజం నింపిన ప్రభాత్ పట్నాయక్, వి.శ్రీనివాసరావు, ఎంవిఎస్.శర్మ ప్రసంగాలు

లెనిన్, సీతారాం ఏచూరిలకు నివాళ్లర్పిస్తున్న ప్రభాత్ పట్నాయక్, వి.శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

సామ్రాజ్యవాదంపై పోరాడడం ద్వారా లెనిన్ వారసత్వాన్ని నిలబెట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం విశాఖలోని డాబాగార్డెన్స్‌లోగల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సోవియట్ సోషలిస్ట్ విప్లవ రథసారథి - సమసమాజ నిర్మాత విఐ.లెనిన్ శత వర్ధంతి సభ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షత వహించారు. తొలుత లెనిన్ చిత్రపటానికి, ఇటీవల కన్నుమూసిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి ప్రముఖ ఆర్థికవేత్త, జెఎన్‌యు ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'లెనిన్ విప్లవ జీవితం - సోషలిస్టు విప్లవం -నేటి సామ్రాజ్యవాదం' అన్న అంశంపై రాష్ట్ర స్థాయి మిగతా 2లో..

కళారూపాలతో ఆకట్టుకున్న పిఎన్ఎం కళాకారులు

మానవహారం చేపట్టిన ఉక్కు కార్మికులు, నిర్వాసితులు

ఉక్కు రక్షణకు చేయి చేయి కలిపిన జనం

అగనంపూడి నుంచి గాజువాక వరకూ భారీ మానవహారం

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక

'చేయి చేయి కలుపుదాం.. విశాఖ ఉక్కును కాపాడుకుందాం' పేరిట భారీ మానవహారానికి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఇచ్చిన పిలుపునకు ఆదివారం విశేష స్పందన లభించింది. అగనంపూడి నుంచి గాజువాక వరకూ ప్రజలు ఎక్కడికక్కడ చేయిచేయి కలిపి మానవహారంగా ఏర్పడ్డారు. ఉక్కు పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు, అధికారులు, వారి కుటుంబీకులు, ఉక్కు నిర్వాసితులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సందర్శించి మద్దతు తెలిపారు. అక్కడి కూడలిలో జాతీయ రహదారిపై బైఠాయించి ఉక్కు పరిరక్షణ నినాదాలు చేశారు. అనంతరం అక్కడ మానవహారం కొనసాగింది. దీక్షా శిబిరం మిగతా 2లో..

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

సెప్టెంబర్‌లో 77 కేసులు ఛేదన

▸ వార్త 20లో..

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

▸ వార్త 8లో..

గ్యాస్ సిలిండర్ పేలి కార్మికుడు మృతి

▸ వార్త 5లో..

దసరాకు 250 ప్రత్యేక బస్సులు

ప్రయాణికులకు పలు రాయితీలు
'ప్రజాశక్తి'తో ఆర్‌టిసి విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలరాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

దసరాలో ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 4 నుంచి 20 వరకు 250 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపేందుకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేశామని ఆర్‌టిసి విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలరాజు తెలిపారు. ప్రత్యేక సర్వీసులను నడపడమే కాకుండా పలు రాయతీలనూ ప్రయాణికులకు అందిస్తున్నామని వెల్లడించారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే..

విశాఖ నుంచి ఏయే ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఉన్నాయి?

విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు 37 బస్సులు, విజయవాడకు 60 బస్సులు, శ్రీకాకుళం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, సోంపేట, బొబ్బిలి, పలాసకు 100 బస్సులు, అమలాపురం, భీమవరంకు 3, రాజమండ్రికి 25, కాకినాడకు 25 బస్సులను అందుబాటులో ఉంచాం.

రాయితీల వివరాలు తెలియజేస్తారా?

ప్రయాణంలో రాను పోను ఒకేసారి రిజర్వేషన్ చేయించుకుంటే 10 శాతం రాయితీ కల్పిస్తున్నాం. ప్రత్యేక బస్సులు సైతం సాధారణ ఛార్జీలతోనే అందుబాటులో ఉంటాయి. రిజర్వేషన్ కోసం ఆన్‌లైన్‌లో www.apsrtconline.inలో సంప్రదించాలి. ద్వారకా బస్ స్టేషన్ లోనూ, మిగతా 2లో..

'బ్రాండిక్స్' ఒప్పంద ఉల్లంఘన

- వివిధ పన్నుల నుంచి మినహాయింపు
- 50 పైసలకే యూనిట్ విద్యుత్ ◆ 15 పైసలకే లీటర్ నీరు
- అయినా 60 వేల మందికి ఉపాధి కల్పించని వైనం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వం నుంచి రాయితీలన్నీ పొంది, సదుపాయాలన్నీ అనుభవించిన శ్రీలంకకు చెందిన బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బిఐఎసి) యాజమాన్యం తాను అమలుచేయాల్సిన ఒప్పంద హామీలను మాత్రం అటకెక్కించింది. ఆర్థిక లబ్ధి కోసం అబద్ధాలు ఆడటానికి కూడా వెనుకాడటంలేదు. అపెరల్ సిటీలో 20,493 మంది పనిచేస్తుంటే లక్ష మందికి ఉపాధి కల్పించినట్లు చెప్పడానికి కూడా సిగ్గుపడలేదు. బ్రాండిక్స్ పేరును అధిస్తాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్కుగా మార్చే వరకు పలు విషయాలను రహస్యంగా వుంచింది. 2005 జులై 2న రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి, బ్రాండిక్స్ సిఇఒ సంతకాలు చేసిన ఒప్పంద పత్రంలో ఇంతవరకు యాజమాన్యం ఎన్ని హామీలు అమలు చేసిందో సమీక్షించిన పాపానపోలేదు. ఎగుమతి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు, సమగ్ర, పరిశ్రమల ప్రోత్సాహం కోసం రాష్ట్ర ప్రభుత్వం, బ్రాండిక్స్ ఏర్పాటు చేసే స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి) కింద వెయ్యి ఎకరాల భూమిలో బ్రాండిక్స్ 76 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 24 శాతం చొప్పున వాటాలు కలిగివున్నాయి.

ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడులను అపెరల్ సిటీకి ఆకర్షించడంతో పాటు ఎస్‌పివి ఏర్పాటైన నాలుగేళ్లలో 60 వేల మందికి స్థిరమైన ఉపాధి కల్పిస్తామని ఒప్పంద పత్రంలో పేర్కొన్నాయి. అచ్యుతాపురంలోని బ్రాండిక్స్‌లో 60 వేల మందికి ఉపాధి కల్పించాక ప్రభుత్వ 24 శాతం వాటాను ఫ్రీ హోల్డ్ (యాజమాన్య హక్కులు) బదలాయించడానికి ప్రభుత్వం అంగీకరించింది. రహదారులు, విద్యుత్, నీరు, సోలిడ్ వేస్ట్ డిస్పోజల్, కాలువలు, కమ్యూనికేషన్ వంటి మౌలిక సదుపాయాలతో పాటు అపెరల్ సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ కింద రూ.40 కోట్లు ఇప్పించడానికి ప్రభుత్వం ఒప్పుకుంది. అంగీకారం ప్రకారం మిగతా 2లో..

MEMORANDUM OF UNDERSTANDING
For
Garment City



This memorandum of understanding is entered into on this day ...... month Year.......... in Hyderabad in the presence of Hon'ble Chief Minister of Andhra Pradesh, Dr. Y.S. Rajasekhara Reddy.

C.E.O., BRANDIX
Signatory on behalf of Brandix

SECRETARY TO GOVERNMENT
INDUSTRIES & COMMERCE DEPT.,
Signatory on behalf of Govt. of AP

Witnesses:

Witnesses:

ఒప్పంద పత్రాలు

మొదటి పేజీ తరువాయి..

'బ్రాండిక్స్' ఒప్పంద ఉల్లంఘన

అపెరల్ సిటీలో కస్టమ్స్ క్లియరెన్స్ సదుపాయం కల్పించింది.

అపెరల్ సిటీలో కనీస వేతనాలు అమలుచేయడంతో పాటు ప్రతీ ఐదేళ్లకు ఒకసారి సవరించి కార్మికులకు చెల్లించాల్సివుంది. వస్త్ర పరిశ్రమలో పనిచేసే కార్మికుల కోసం నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు నైపుణ్య, శిక్షణాభివృద్ధి కాలేజీ ఏర్పాటు చేయాల్సివుంది. ఇక్కడ శిక్షణకు అయ్యే ఖర్చులో 50 శాతంగానీ, లేదంటే ఐదువేల రూపాయలుగానీ బ్రాండిక్స్‌కు చెల్లించడానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. విద్యుత్ సరఫరాలో అధికారిక కోతల నుంచి మినహాయింపు ఇచ్చింది. యూనిట్ విద్యుత్‌కు చెల్లించే 75 పైసల్లో 25 పైసలు రాయితీ భరించడానికి, ఎస్‌పివి ఏర్పడినప్పటి నుంచి ఐదేళ్ల వరకు లీటర్ నీరు 15 పైసలకు ప్రభుత్వం సరఫరా చేయడానికి, వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చేసింది. కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, ఎగుమతులు, స్థానికంగా కొనుగోలుచేసే ఇతర యంత్రాలు, ముడిసరుకు, వినియోగ వస్తువులు, విడి భాగాలకు పన్నుల చెల్లింపు సహా పదేళ్ల వరకు వంద శాతం ఆదాయం పన్ను నుంచి బ్రాండిక్స్ మినహాయింపు పొందింది.

పరిశ్రమల ప్రోత్సాహం పేరుతో వివిధ రూపాల్లో ప్రభుత్వం ఇస్తున్న కోట్ల రూపాయల విలువజేసే రాయితీలను యాజమాన్యం అనుభవిస్తోంది. పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించని, కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయని, ఇతర రక్షణ, భద్రత సదుపాయాలు కల్పించని యాజమాన్యంపై ప్రభుత్వం చర్య తీసుకోని ఫలితంగా కార్మికులకు అన్యాయం జరుగుతోంది. ఒప్పందం అమలుపై అధికారులు, బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరైస్వామి వివరణ ఇవ్వడానికి నిరాకరించారు.

కనీస వేతనాలు అమలుచేయాలి

బ్రాండిక్స్ అపెరల్ సిటీలో కార్మికులకు కనీస వేతనాలు, ఇతర సదుపాయాలు అమలుచేయాలి. ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయల రాయితీలు పొంది 60 వేల మందికి ఉపాధి కల్పించని యాజమాన్యం నుంచి రాయితీలను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలి. బ్రాండిక్స్ పేరును అధిస్తాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్కుగా మార్చుకొని అదనపు రాయితీలు పొందడానికి చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాలి. ఒప్పందాలను బహిర్గతం చేయాలి.

జి.కోటేశ్వరరావు, సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

దసరాకు 250 ప్రత్యేక బస్సులు

ఏజెంట్ల వద్ద టిక్కెట్లు లభిస్తాయి.

బస్‌పాస్ కౌంటర్లు ఎప్పటి నుంచి మళ్లీ పనిచేస్తాయి ?

ద్వారకా బస్ స్టేషన్‌లో ఆర్‌టిసి బస్సు పాస్ కౌంటర్లను ఈ నెల 7 నుంచి మళ్లీ అందుబాటులోకి తీసుకురానున్నాం. పాస్‌ల మంజూరు చేసే వెబ్ సైట్ ఆధునికీకరణ కోసం శని, ఆదివారాలలో ఈ కౌంటర్లను మూసి వేశాం. సోమవారం నుంచి యధావిధిగా నడుస్తాయి.

ఉక్కు రక్షణకు చేయి చేయి కలిపిన జనం

వద్ద వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కుపై ఆటవిక న్యాయాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతున్న మాటలలో విశ్వాసం కానరాలేదన్నారు. రోజురోజుకూ ప్లాంట్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఉక్కు కార్మికుల ఘోష పాలకులకు పట్టకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలూ ఉక్కు రక్షణ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, నాయకులు జె.అయోధ్యరామ్, ఎస్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్.నర్సింగరావు అరెస్టు, విడుదల

కూర్మన్నపాలెం కూడలిలో ఆందోళనకు దిగిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావును పోలీసులు అరెస్టు చేసి విడుదల చేశారు. ఉక్కు కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం కార్మికులను దెబ్బతీసే క్రమంలో వారి ఆర్థిక ప్రయోజనాలపై ఆంక్షలు విధిస్తోందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

పాత గాజువాక జంక్షన్‌లో చేపట్టిన మానవహారాన్ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కాకుండా చూడాల్సిన బాధ్యత కూటమిదేనన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు, మిగిలిన నిర్వాసితుల ఉపాధి, సొంత గనులు, సెయిల్‌లో విలీనం కోసం 1333 రోజులుగా పోరాటం చేస్తున్న కార్మికులకు వైసిపి మద్దతు ఉంటుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, నాయకులు దేవన్ రెడ్డి, పరదేశి, పిట్ట రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

ఆశా జాస్తికి శక్తి నవరత్న అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దసరా పండగ సీజన్‌ను పురస్కరించుకుని 'వరల్డ్ ఆఫ్ ఉమెన్ ఫెడరేషన్ ఇండియా' వారు ఇటీవల హైదరాబాద్‌లో 'శక్తి నవరత్న' అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి చేసిన విశేష సేవలను, మహిళా సాధికారతను పరిగణనలోకి తీసుకుని కొంతమందికి ఈ అవార్డులను అందజేశారు. అందులో ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డుకు విశాఖ నగరంలోని సన్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తిని ఎంపిక చేశారు. పలువురు ప్రముఖుల మధ్య ఈ అవార్డును ఆమెకు అందజేశారు. విద్యా రంగంలో ఆశా జాస్తి చేసిన విశేష కృషికి ఈ అవార్డు లభించడంతో ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

లెనిన్ వారసత్వాన్ని నిలబెట్టాలి

(మొదటి పేజీ తరువాయి..)

సెమినార్ జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ ఫాసిజాన్ని ఓడించాలంటే దానికి మూలమైన నయా ఉదారవాద విధానాలపై నిరంతరం పోరాడాలని అన్నారు. సామ్రాజ్యవాదం, ఫాసిజంపై పోరాటానికి లెనిన్ రచనలే ఆయుధమన్నారు. కార్మికవర్గ పార్టీ ఎలా ఉండాలో తెలియజెప్పిన మహోపాధ్యాయుడు లెనిన్ అని కొనియాడారు. నేడు అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. నయా ఉదారవాద విధానాలు అవలంబించిన తరువాత పెరిగిన రైతుల ఆత్మహత్యలు, గ్రామీణం నుంచి పట్టణానికి పెరిగిన వలసలు తదితర వివరాలను వెల్లడించారు.

లెనిన్ శత వర్ధంతి సభకు హాజరైన జనం

'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి - లెనినిస్టు దృక్పథం - ప్రత్యామ్నాయ విధానాలు' అన్న అంశంపై వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మారిన వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా లెనిన్ దృక్పథాన్ని అన్వయించుకుని పోరాడాలని అన్నారు. అసమానతలు లేని అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. సనాతన ధర్మం పేరిట జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. రాజ్యాంగంపై ప్రమాణం చేసి 'నీ మతం.. నా మతం' అంటూ కాషాయ వస్త్రాలు ధరించి పవన్ మాట్లాడడం సరైంది కాదని శ్రీనివాసరావు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆయన ఆ పనిచేయడం లేదన్నారు.

'లెనినిజం - వర్తమానం - కర్తవ్యం' అన్న అంశంపై ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ నేటి సమాజంలో ఎదురయ్యే తాత్విక, సామాజిక సవాళ్లను గుర్తించి ముందుకెళ్లడమే లెనిన్ చూపిన మార్గమని అన్నారు. గతాన్ని వక్రీకరించి తప్పులు చేసే సంఘపరివార్, ఇతర ఉన్మాద శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, సిహెచ్.నర్సింగరావు, విఎస్.పద్మనాభరాజు, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, బి.జగన్, కెఎం.శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. సభలో ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సభికుల్లో ఉత్తేజం నింపాయి.

సెప్టెంబర్‌లో 77 కేసులు ఛేదన

రికవరీ చేసిన ఫోన్‌ను బాధితురాలికి అప్పగిస్తున్న సిపి

మంత్లీ రికవరీ మేళాలో సిపి శంఖబ్రాత బాగ్చి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో సెప్టెంబర్ నెల రికవరీ మేళాను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్‌లో 105 కేసులు నమోదయ్యాయని, 77 కేసులను విజయవంతంగా ఛేదించామని తెలిపారు. చోరీకాబడిన సొత్తులో రూ.45,44,850 విలువగల వస్తువులను, రూ.40,80,000 విలువగల 272 మొబైల్ ఫోన్లను కలుపుకుని మొత్తం రూ.86,24,850 విలువగల సొత్తును రికవరీ చేసినట్టు వెల్లడించారు. ఆ వస్తువులను రికవరీ మేళా ద్వారా బాధితులకు అందజేస్తామన్నారు. సెప్టెంబర్ నెలలో రికవరీ చేసుకున్న సొత్తులో 1204.06 గ్రాముల బంగారం, 943.43 గ్రాముల వెండి, రూ.1,54,840 నగదు, 25 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక కారు, 287 మొబైల్ ఫోన్‌లు, ఒక లాప్ టాప్, 30 మెట్రిక్ టన్నుల బొగ్గు, 30 కేజీల కాపరు ఎలక్ట్రిక్ వైర్లు ఉన్నాయని తెలిపారు. నగరవ్యాప్తంగా 335 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. రాత్రి వేళలో గస్తీ నిర్వహణను మరింత పటిష్టం చేశామని, సెప్టెంబర్ నెలలో చాట్ బాట్ ద్వారా 40.80 లక్షల విలువగల 272 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. ఇప్పటివరకు విశాఖ కమిషనరేట్ పరిధిలో 5.21 కోట్ల విలువగల 3479 ఫోన్‌లు రికవరీ చేశామన్నారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే చాట్ బాట్ ద్వారా 9490617916 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి కె.లతా మాధురి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జర్నలిస్టుల దసరా సంబరాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విజయ దశమి పండగ అందరి జీవితాల్లో ఆనందం తీసుకు రావాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు అన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఎపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన జర్నలిస్టుల దసరా పండగ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల జీవిత లక్ష్యం అయిన ఇళ్ల స్థలాల సాధన కోసం ప్రభుత్వ పెద్దలను పలుమార్లు కలిసి విన్నవించడం జరిగిందని, అది త్వరలోనే కూటమి ప్రభుత్వం ద్వారా సిద్ధించే అవకాశముందని తెలిపారు. అర్హులైన జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల సమస్యను పరిష్కరించడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నామన్నారు. విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులు నిత్యం పని ఒత్తిడిలో ఉంటూ, విశ్రాంతి లేని బిజీ జీవితం గడుపుతున్నారని, వారి కుటుంబాలకు పర్వదినాల సందర్భంగా ఆహ్లాదం ఆనందం కలిగించే ఇటువంటి సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు దోహద పడతాయని అన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతుమహంతి నారాయణ, జి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

పేరుకే మండలం.. అభివృద్ధి శూన్యం...

ఇదీ ఆనందపురం దుస్థితి

వెలవెలబోతున్న ఆనందపురం సంత ప్రాంతం

ప్రజాశక్తి -ఆనందపురం : ఉత్తరాంధ్ర జిల్లాలో మంచి గుర్తింపు పొందిన ఆనందపురం నేడు అభివృద్ధికి ఆమడదూరమైంది. ఆనందపురం గ్రామం కళాహీనంగా మారింది. ఒకప్పుడు ఆనందపురం పంచాయతీలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండేవి. దీంతో ఆనందపురం మండలంగా పేరు పెట్టారు. పంచాయతీల విభజన అనంతరం ఆనందపురం గ్రామపంచాయతీ, ఎల్‌వి.పాలెం గ్రామపంచాయతీ విడిపోయిన అనంతరం ఆనందపురంలో ఉన్న కార్యాలయాలన్నీ లోడగలవాని పాలెం పంచాయతీ పరిధిలోకి వెళ్లాయి. దీంతో అప్పటి నుంచి ఆనందపురం కళా విహీనంగా మారింది. ఆదాయం లోడగలవాని పాలెం గ్రామపంచాయతీకి వెళ్తోంది.

ఆనందపురంలో ప్రతి గురువారమూ సంత నిర్వహించేవారు. 26 పంచాయతీల నుంచి ఆనందపురం సంతకు రైతులు, వినియోగదారులు వచ్చేవారు. కాయగూరలు, చేపలు, తిండి వస్తువులు, దుస్తులు ఒకే చోట దొరకడంతో ఈ సంతకు అప్పట్లో ప్రత్యేకమైన గుర్తింపు ఉండేది. ప్రస్తుతం ఆ సంత మచ్చుకైనా కనబడడం లేదు. వేములవలస పూల మార్కెట్ అభివృద్ధి అనంతరం ఆనందపురంలో నిర్వహించే సంత కనుమరుగైపోయింది. గతంలో ఆనందపురం గ్రామానికి ఆర్‌టిసి బస్సు సేవలు ఉండేవి. సుదూర ప్రాంతాల నుంచి బస్సుల్లో ఈ సంతకు వచ్చి కాయగూరలు కొనుగోలు చేసుకుని వెళ్లేవారు. ప్రస్తుతం ఆనందపురం గ్రామానికి ఆర్‌టిసి బస్సులు కూడా లేవు.

ఎన్నో ఏళ్లుగా సంతలో వ్యాపారం చేసిన కొద్దిమంది వ్యాపారస్తులు ఇప్పటికీ ప్రతి గురువారమూ ఆనందపురం సంతకు వచ్చి ఆరుబయట కిరాణా, దుస్తులు, ఫ్యాన్సీ వస్తువులు అమ్మకాలు సాగిస్తున్నారు.

గురువారం సంతపై ఆ వ్యాపారస్తులతో ప్రజాశక్తి మాట్లాడింది. తనకు పదేళ్ల వయసు నుంచి ఈ సంతలో ఫ్యాన్సీ వస్తువులను అమ్మేవాడినని తగరపువలస నుంచి వచ్చే మాదాబత్తుల రామరాజు తెలిపారు. ఈ సంతలో 1970 నుంచి దుస్తుల వ్యాపారం చేసేవాడినని సీతంపాలేనికి చెందిన ఎం. బంగారయ్య తెలిపారు. ఇలా మామిడి సాదు వెంకట్రావు, వానపల్లి రాజు, మేడిశెట్టి నరేష్, జోగా రవి తదితరులు తమ అనుభవాలను వివరించారు. గత 40 సంవత్సరాల నుంచి అనందపురం గురువారం సంతకు వచ్చి వ్యాపారాలు చేసేవారమని, ప్రస్తుతం వ్యాపారాలు జరగకపోయినా అలవాటు ప్రకారం సంతకు వస్తున్నామని తెలిపారు. ఈ సంతలో అన్ని రకాల వస్తువులు దొరికేవని, ప్రస్తుతం వెలవెలబోతుందని అనందపురం గ్రామానికి చెందిన సురకత్తుల భాగ్యలక్ష్మి వాపోయారు. మండల కేంద్రంగా ఉన్న ఆనందపురం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి నాయకులు, అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంటా సమక్షంలో మంత్రి కందుల దుర్గేష్‌ను సన్మానిస్తున్న బోస్‌బాబు

మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన బోస్‌బాబు

ప్రజాశక్తి - ఆనందపురం : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల లక్ష్మిదుర్గేష్ ప్రసాద్‌ను మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ మర్యాదపూర్వకంగా కలిశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యాన మండలంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించారని బోస్ బాబు తెలిపారు.

గిరిజన మహిళలకు ఆరోగ్యంపై గీతం శిక్షణ

ప్రజాశక్తి -మధురవాడ : భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) సీడ్ సిఆర్‌పిసి ప్రాజెక్ట్‌లో భాగంగా అనకాపల్లి జిల్లా వి.మాడుగులలో గడబ గిరిజన తెగ మహిళల కోసం ఆరోగ్యం, పోషకాహారం, మొక్కల పెంపకంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రత్యేక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. కృషి విజ్ఞాన్ కేంద్రం (కెవికె-ఐసిఆర్), వరల్డ్ ఆఫ్ ఉమెన్ (వోవ్), అరోహన్ ట్రైబల్ సొసైటీ (ఆర్‌టిఎస్)తో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో 100 మంది గిరిజన మహిళలకు కిచెన్ గార్డెన్ సెట్‌లను అందించడంతో పాటు టెలిమెడికల్ సేవల ద్వారా సమగ్ర సంక్షేమం కోసం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

గిరిజనులకు మొక్కలను అందిస్తున్న గీతం ప్రతినిధులు

ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ప్రధాన పరిశోధకులు డాక్టర్ స్వాతి చిక్కాల మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు సామాజిక నిగమన కేంద్రాలు (సిఆర్‌పిసి) ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వి.మాడుగులలో కిచెన్ గార్డెన్‌లను గిరిజన తెగలలో ప్రోత్సహించడం ద్వారా ఆ ప్రాంతంలో పోషకార సమస్యను అధిగమించేలా, రక్తహీనత వంటి సమస్యలు లేకుండా చేయడం తమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రోత్సహించిన డిఎస్‌టి సీడ్ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కొంగ గోపీకృష్ణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య సేవల్లో రోగుల భద్రత ముఖ్యం

ఫార్మాకోలజిస్ట్ సొసైటీ జాతీయ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ కాంతి

ఫార్మాకోలజిస్ట్ సొసైటీ జాతీయ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : ఆరోగ్య సేవల్లో రోగుల భద్రత అత్యంత ప్రాముఖ్యం కలిగి ఉందని, ముఖ్యంగా మందుల సురక్షిత వినియోగాన్ని నిర్ధారించడానికి ఫార్మకోవిజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఐక్యూవిఐఎ సంస్థ ఆసియా ప్రాంత వైద్య సురక్షిత విభాగం అధిపతి డాక్టర్ కాంతి పేర్కొన్నారు. గీతమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసర్చ్ (జిమ్స్‌ఆర్)లో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ ఫార్మాకోలజిస్ట్ సొసైటీ జాతీయ కాన్ఫరెన్స్-2024లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఫార్మకోవిజిలెన్స్ రంగం భవిష్యత్తులో కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించడం, యువతలో ప్రతిభను పెంపొందించడం ద్వారా రోగులకు ఉత్తమ సేవలు అందించవచ్చని అభిప్రాయపడ్డారు.

బికె.రాయ్ రీసెర్చ్ సెంటర్ (కోల్‌కతా) క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రోజ్యోతి బౌమిక్ మాట్లాడుతూ, వైద్యసేవలు అందించే సమయంలో మెడికేషన్ ఎర్రర్ రిపోర్టింగ్ సిస్టమ్ (ఎంఇఆర్ఎస్) ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్య నిపుణుల కోసం మెడికేషన్ ఎర్రర్ రిపోర్టింగ్ సిస్టమ్ (ఎంఈఆర్ఎస్)పై క్రమం తప్పకుండా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సక్రమంగా రూపొందించబడిన ఎంఇఆర్ఎస్ ఆసుపత్రులలో పారదర్శకత, బాధ్యత, నిరంతర మెరుగుదల కలిగిన సంస్కృతిని పెంపొందించడంలో సహాయపడుతుందన్నారు.

జిమ్స్‌ఆర్ వైద్య నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ మాధవులు, ప్రొఫెసర్ డాక్టర్ తులసి మాధురి, అధ్యాపకులు డాక్టర్ స్యామ్ కుమార్, డాక్టర్ సింధూర, డాక్టర్ పూజిత, డాక్టర్ కృష్ణసాయి, డాక్టర్ విన్నీలా చర్చల్లో పాల్గొన్నారు. వివిధ వైద్య కళాశాలల పీజీ విద్యార్థులు ఫార్మకోలజీ పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తూ క్విజ్ పోటీలో పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- బస్సు డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట జాతీయ రహదారి శ్రీనివాస్ ఏజెన్సీ వద్ద లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బస్సు డ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కశింకోట సిఐ వినోద్ బాబు తెలిపిన వివరాలు ప్రకారం... కశింకోట జాతీయ రహదారి శ్రీనివాస్ ఏజెన్సీ వద్ద ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని ఒక లారీ యూటర్న్ తీసుకుంటుండగా, అదే సమయంలో నర్సాపురం నుండి విశాఖపట్నం వస్తున్న ఎపిఎస్ఆర్‌టిసి బస్సు సడన్‌గా కంట్రోల్ చేసుకోలేక పక్కనే ఆగివున్న మరో లారీని వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ గుత్తులి జగన్మోహన్‌రావుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురికి చిన్నచిన్న గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కు తరలించి చిక్సిత అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడు జగన్మోహనరావు స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా, ఎలమంచిలి మండలం ఎల్లపాకూరు. ఈ కేసును కశింకోట సిఐ వినోద్‌బాబు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ ఎస్‌కెఎంఎల్ నగర్‌లో ఒక ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆరిలోవ పోలీసులు శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఎస్‌కెఎంఎల్ నగర్‌లోని వరద ప్రశాంత్ ఇంట్లో సుమారు ఒక టన్ను పిడిఎఫ్ బియాన్ని 36 బస్తాల్లో నిల్వ చేసి శనివారం అర్ధరాత్రి టాటా ఎఎస్ వ్యాన్‌లో లోడ్ చేస్తుండగా ఆరిలోవ శాంతి భద్రతల ఎస్ఐ వై.కృష్ణ సిబ్బందితో వెళ్లి బియ్యాన్ని పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని, టాటా ఎఎస్ వ్యాన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

బైక్ రేసర్లపై కేసు

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్య పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ రేసింగ్ నిర్వహించిన వారిపై కేసు నమోదు చేసినట్లు నార్త్ జోన్ ట్రాఫిక్ సిఐ కాంతారావు తెలిపారు. శనివారం సాయింత్రం పనోరమా హిల్స్ రోడ్‌లో కొందరు బైక్ రేసింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పిఎం.పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. మూడు ద్విచక్రవాహనాలపై ఐదుగురు వ్యక్తులు పనోరమా ఐటి సెజ్ రోడ్ నుంచి రుషికొండ వైపు వాహనాలపై అతివేగంగా, నిర్లక్ష్యంగా, పెద్ద పెద్ద శబ్దాలతో రేసింగ్ చేస్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఒమ్మి తానోజ్, జార్జ్ రిచర్డ్ సన్, మోపడ వాసు, షైక్ అర్మన్, వాసుపల్లి జ్ఞానేశ్వరిపై పోలీసులు కేసు నమోదుచేశారు. అనంతరం వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎంవి యాక్ట్ ప్రకారం బైక్ రేసింగ్ చేస్తున్నవారిపై సెక్షన్ 189 ప్రకారం లైసెన్సు మూడు నెలలు రద్దు చేయుటకు లైసెన్సు అథారిటీకి రికమెండ్ చేయనున్నట్లు తెలిపారు. రెండోసారి రేసింగ్ చేస్తూ పట్టుబడితే శాశ్వతంగా డ్రైవింగ్ లైసెన్సు రద్దుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జి.ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. దీనికి సంబంధించి సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 5వ వార్డు పరిధి శివశక్తి నగర్‌కు చెందిన టి.అశ్విన్ ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త శ్రీనివాసరావు చుట్టు పక్కల, బంధువులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి -కొత్తకోట: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్ చేసి అపరాధ రుసుము విధించినట్లు కొత్తకోట ఎస్సై ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం దొండపూడి చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మాడుగుల మండలం జెడి పేట నుంచి కొత్తకోటకు రెండు ఇసుక ట్రాక్టర్‌లు వస్తుండగా ఇసుక తరలింపుకు ఎటువంటి అనుమతులు లేక పోవడంతో సీజ్ చేసి స్టేషన్‌కి తరలించామని ఎస్సై చెప్పారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు 10వేల అపరాధరుసుం విధించినట్లు తెలిపారు.

విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేస్తున్న లక్ష్మి, లక్ష్మీబాయి

క్రీడలతో ఆరోగ్యం

ప్రజాశక్తి -గాజువాక : ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని జివిఎంసి 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. వార్డు పరిధిలో ఉన్న క్రీడా మైదానంలో ఆదివారం బాక్సింగ్, అథ్లెటిక్స్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యం కాపాడుకోడానికి క్రీడలు ఎంత దోహదపడతాయన్నారు. రూ.50 లక్షల వ్యయంతో ఈ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ న్యాయవాది అండిబోయిన లక్ష్మి మాట్లాడుతూ, క్రీడల వల్ల మానసికంగా, శారీరకంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించారు. పిల్లల్ని క్రీడలు వైపు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి పవర్ లిఫ్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అండిబోయిన అప్పారావు, జివి.రెడ్డి, బిబిసి కోచ్ వెంకటేష్, సతీష్, శ్రీనివాస్, ఆలీ, గురునాథ్, అప్పన్న, రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, స్పోర్ట్స్ కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి -గాజువాక : శీలానగర్ అనురాధ ఆటో సర్వీస్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన శ్రీ కనక దుర్గ అమ్మవారిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మ వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఒక చోట కలుసుకున్న గొట్టిపల్లి జెడ్‌పి పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004 -05 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. 20 సంవత్సరాలు అనంతరం కలిసిన వారు పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు. తోటి మిత్రులకు ఎలాంటి సమస్య వచ్చినా అందరూ అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, అప్పలనాయుడు, అలేఖ్య, దివ్య తదితరులు పాల్గొన్నారు.

గోల్ఫ్ టోర్నీలో అంగద్ చీమా విజయం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ది ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పిజిటిఐ), విశాఖలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఆధ్వర్యాన నాలుగు రోజులపాటు నిర్వహించిన 'వైజాగ్ ఓపెన్ 2024' గోల్ఫ్ టోర్నమెంట్‌లో చండీగఢ్ గోల్ఫ్ క్రీడాకారుడు అంగద్ చీమా మొదటి స్థానాన్ని కైవసం చేసుకొని రూ.15 లక్షల చెక్కును అందుకున్నాడు. రెండో స్థానంలో అమన్ రాజ్ (పాట్నా), మూడో స్థానాన్ని ఆర్యన్ రూపా ఆనంద్ (బెంగళూరు), కార్తిక్ శర్మ(గురుగ్రాం) గెలుచుకున్నారు. విజేతలను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.

చండీగఢ్‌కు చెందిన అంగద్ చీమా ఈ టోర్నమెంట్‌లో సాధించిన విజయంతో టాటా స్టీల్ పిజిటిఐ ర్యాంకింగ్‌లో నాలుగు నుంచి మూడో స్థానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చీమా మాట్లాడుతూ, ఇటీవల చాలా సందర్భాల్లో విజయానికి దగ్గరగా వచ్చానన్నారు. ఎట్టకేలకు ఈ టైటిల్ గెలవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

లక్ష్యానికి మించి ఆదాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : లక్ష్యానికి మించి ఆదాయ సముపార్జనలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ దూసుకుపోతోంది. దీని పరిధిలో ఆదాయ వనరులు పుష్కలంగా ఉండడం, వాటి నుంచి సక్రమంగా ఆదాయం సమకూరుతుండడంతో గడచిన కొన్నేళ్లలో రూ.కోట్లలో వసూలు జరుగుతోంది. అయితే అరకొర సిబ్బంది ఉండడంతో మరింత ఆదాయం పొందేందుకు వీలున్నా ఆస్కారం లేకుండా పోతోందనే అభిప్రాయమూ వ్యక్తమౌతోంది.

భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీకి 2024 -25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయ లక్ష్యం రూ.4.60 కోట్లు అయితే 2024 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ.2 కోట్లు వసూలైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి పెరిగింది. రూ.4.26 కోట్ల ఆదాయం సమకూర్చి పెట్టాలనేది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం. అయితే అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగా ప్రతికూల పరిస్థితుల్లోనూ రూ.4.43 కోట్లు ఆదాయం సమకూర్చారు. 2022 -23లో రూ.4 కోట్లు లక్ష్యం కాగా రూ.4.26 కోట్లు ఆదాయం సమకూర్చారు.

ఆదాయ వనరులు ఇవీ..

భీమిలి డివిజన్ పరిధిలో భీమిలి బీచ్ రోడ్డులో ఉన్న 8 రొయ్యల తయారీ, ఉత్పత్తి పరిశ్రమలు, 9 ధాన్యం మిల్లులు, 10 ప్లే ఉడ్ పరిశ్రమల ద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం వస్తోంది. ఆనందపురం మండలం గంభీరం వద్ద ఉన్న ఒకే ఒక్క చెక్ పోస్టు ద్వారా మొక్క జొన్న, ధాన్యం, ఉల్లి, పత్తి ఎగుమతులు దిగుమతులు సందర్భంగా ఆదాయం వస్తుంది.

ఎ పి సెంటర్ ఫర్ అవుట్ సోర్సింగ్ ఆధ్వర్యాన ఆరుగురు సెక్యూరిటీ గార్డులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సెక్యూరిటీ గార్డులు ఎక్కువ మంది ఉంటే అదనంగా చెక్ పోస్టులు ఏర్పాటుచేసి ఆహార పంటల ఎగుమతులపై ఆదాయం ఇంకా ఎక్కువ వచ్చేది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తే ఉపయోగం.

బీచ్ రోడ్డులో ఎంతో కాలంగా ఉన్న రొయ్యల పరిశ్రమల ద్వారా కాలుష్యం ఏర్పడుతుందని, పర్యావరణానికి ఇబ్బంది కలుగుతుందని అనేక ఆరోపణలు, ఉన్నతాధికారులకు ఫిర్యాదుల నేపథ్యంలో ఇక్కడి రొయ్యల పరిశ్రమల్లో ఉత్పత్తి తగ్గించి, నగరంలో ఉన్న రొయ్యల పరిశ్రమల్లో ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో రొయ్యల ఉత్పత్తి ఎగుమతుల ద్వారా మార్కెట్ కమిటీకి వచ్చే ఆదాయంలో అనివార్యంగా కోత ఏర్పడింది. వరి, మొక్క జొన్న పంటల ఎగుమతులపై ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూపాయి, స్వదేశంలో చేపలు, రొయ్యల ఎగుమతులపై రూ.0.50 పైసలు, విదేశాలకు ఎగుమతిపై రూ.0.25 పైసలు వసూలు చేస్తున్నారు. ఇంతగా ఆదాయం తెచ్చి పెడుతున్న కార్యాలయం గత ఏడాదిగా అద్దె భవనంలోనే కొలువుదీరుతోంది.

ఎఎంసి కార్యాలయం శిథిలావస్థకు చేరింది. అదే ఆవరణలో కొత్త భవనం నిర్మాణం ప్రారంభమైనప్పటికీ, కాంట్రాక్టర్‌కు నిధుల మంజూరులో జాప్యంతో ఆ భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.

అదనపు సిబ్బంది ఉంటే మరింత ప్రయోజనం

మార్కెట్ కమిటీ కార్యాలయం ఇదే

విఎఫ్‌ఎస్‌తో ప్రేక్షకులకు ప్రభావిత సినిమాలు చేరువ

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభావితమైన సినిమాలను ప్రేక్షకులకు చేరువ చేయడంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ (విఎఫ్ఎస్) పాత్ర ఎంతో ఉందని ప్రముఖ రచయిత ఎస్‌వి.రామారావు పేర్కొన్నారు. డాక్టర్ ఎల్ బి కళాశాలలోని గాంధీ సెమినార్ హాల్లో వైజాగ్ ఫిల్మ్స్ సొసైటీ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామారావు హాజరై మాట్లాడారు. ప్రతి వ్యక్తీ జీవితంలో నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉంటాయని చెప్పారు. విశాఖలోని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, 2003లో విఎఫ్ఎస్‌ను స్థాపించామని, అనేక ఫిలిం ఫెస్టివల్, ప్రముఖ దర్శకులతో ముఖాముఖి, గొప్ప సినిమాల ఆదరణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జాయింట్ సెక్రటరీ బి.చిన్నారావు, ఉపాధ్యక్షులు ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, బి.గణేశ్వరబాబ్జి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్‌వి.రామారావును వైజాగ్ ఫిలిం సొసైటీ తరపున సత్కరించారు.

పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద నిత్యాన్నదానం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు గ్రామంలోని శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3న ప్రారంభమైన నిత్యాన్నదానం 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. రోజుకు సుమారు 15 వందల మందికి అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను విరమించుకోవాలి

యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ

దీక్షలో కూర్చున్న యునైటెడ్ పోర్టు అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్‌ను పిపిపికి ఇవ్వాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్‌ను పిపిపికి ఇవ్వాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షనుద్దేశించి సత్యనారాయణ మాట్లాడుతూ, పోర్టు సొంత నిధులతోనే హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కైలాసపురంలో ప్రస్తుతం 80 పడకలతో నడుస్తున్న పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంతో 300 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చి, పోర్టు ఉద్యోగుల వైద్యం ఖర్చును తగ్గించనున్నట్లు యాజమాన్యం చెప్పడం పచ్చి అబద్ధం అన్నారు. ఇప్పటికే పిపిపి మోడల్‌లో నడిచిన గంగవరం పోర్టు, వైజాగ్ పోర్టుల్లో బెర్త్‌లు ఏమయ్యాయో అందరికీ తెలిసిందేనన్నారు. గతంలో కాగ్ నివేదిక ప్రకారం పోర్టుల్లో పిపిపి, బిఒటి విఫలం అయ్యాయని, పోర్టుకు నష్టం వాటిల్లిందని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. పేరుకు మాత్రమే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పిపిపి) అని చెప్పి పబ్లిక్ ఆస్తులను ప్రైవేటుకు గంప గుత్తగా అప్పగించడమేనన్నారు. విశాఖపట్నం పోర్టు 2022-23 సంవత్సరంలో రూ.380 కోట్లు, 2021-22సంవత్సరంలో రూ.276 కోట్లు లాభాలు వచ్చాయని తెలిపారు. పోర్టు కార్మికులకు, అధికారులకు, ఉద్యోగులకు, పెన్షనర్లకు, పోర్టు పూల్, సిహెచ్‌డి, క్యాజువల్స్, ఇతర నాన్ పర్మినెంట్ కార్మికులకు మంచి ఆరోగ్యం-రక్షణ కల్పించేందుకు ఆధునిక పరికరాలను సమకూర్చాలని, అవసరం మేరకు స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలని, అవసరమైన సిబ్బందిని నియమించి పోర్టు యాజమాన్యమే సొంత నిధులతో నిర్వహించాలని డిమాండ్‌చేశారు. నాణ్యమైన మందులు సరఫరా చేయాలని కోరారు. గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రైవేటుపరం చేస్తే జవాబుదారితనం ఉండదన్నారు. ఇప్పటికే విశాఖపట్నం పోర్టులోని బెర్తులను వేదాంత, అదాని, ఎస్సార్ వంటి ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల పోర్టు ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. పోర్టు ఆసుపత్రిని పిపిపికి ఇవ్వడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి కాపాడుకుంటామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.సత్యనారాయణ, త్రినాథ్, శంకరరావు, జెడి.లక్ష్మి, నర్సింగరావు, ఈశ్వరరావు, శంకరరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి కార్మికుడు మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఫ్యూజన్ ఇటుకల ఫ్యాక్టరీ కార్మికుల నివాస షెడ్‌లో ప్రమాదం

వివరాలు వెల్లడిస్తున్న సిఐ ధనుంజయరావు

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలి మండల మర్రిబంద గ్రామ సమీపంలోని 'ఫ్యూజన్' ఇటుకల ఫ్యాక్టరీ వద్ద కార్మికుల నివాసముంటున్న షెడ్‌లో శనివారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి యలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయరావు ఆదివారం అందించిన వివరాలు ప్రకారం... 'ఫ్యూజన్' ఇటుకల ఫ్యాక్టరీ వద్ద అందులో పని చేస్తున్న కార్మికుల నివాసం కోసం నిర్మించిన షెడ్‌లో శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో ముగ్గురు కార్మికులు వంటకు ఉపక్రమించి గ్యాస్ స్టవ్ వెలిగించారు. అప్పటికే గ్యాస్ లీకు కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఆ షెడ్‌లో వంట చేస్తున్న శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం మండలం, పత్రిపుట్టుగ గ్రామానికి చెందిన బడకల కేశవరావు (52), ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహని గ్రామానికి చెందిన ఎం.లోకనాథ్ (27), జి.కృష్ణారెడ్డి (40) తీవ్రంగా గాయపడ్డారు. ఇది గమనించిన ఫ్యాక్టరీ వారు ముగ్గురిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు క్షతగాత్రులు ముగ్గురిని విశాఖ కెజిహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించి బడకల కేశవరావు (52) మృతి చెందారు. మిగిలిన ఇద్దరి పరిస్థితి కూడా విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న యలమంచిలి పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. యలమంచిలి సర్కిల్ ఇనస్పెక్టర్ ధనుంజయరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుని కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : సిఐటియు

'ఫ్యూజన్' బ్రిక్స్ కంపెనీలో వంట గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదం వల్ల మరణించిన బడకల కేశవరావు కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, తీవ్రంగా గాయపడి కెజిహెచ్‌లో ప్రాణాప్రాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఎం.లోకనాథ్, కృష్ణారెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు ఎలమంచిలి మండల కార్యదర్శి చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తరువాత తీవ్రమైన గాయాలైన ముగ్గురు కార్మికులను ఆస్పత్రికి తరలించడంలో కంపెనీ యాజమాన్యం, కాంట్రాక్టర్ తీవ్రమైన నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించారని ఆరోపించారు. శనివారం రాత్రి కెజిహెచ్‌కి తరలించగా ఆదివారం కూడా వారు ఎలా ఉన్నారో చూడడానికి కూడా రాలేదని, బంధువులకు సమాచారం ఇవ్వడంలో కూడా లోపం ఉందని తెలిపారు. మృతుడు కేశవరావు కుమారుడు శశి శనివారం రాత్రి 8.20 గంటల సమయంలో కేశవరావుకు ఫోన్ చేస్తే మీ నాన్న బయటికి వెళ్లారని వచ్చిన తర్వాత మరల కాల్ చేస్తామని చెప్పారని, రాత్రి పది గంటలకు ప్రమాద సంఘటన గురించి సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. ఎమ్.లోకనాథ్ 93 శాతం, జి.కృష్ణారెడ్డికి 73శాతం శరీరం కాలిపోయిందని, ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. కంపెనీ యాజమాన్యం, కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణిని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని, మృతుని కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని శివాజీ డిమాండ్ చేశారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులతో ఎమ్మెల్యే విజయకుమార్

క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : క్రీడలలో రాణిస్తే సమాజంలో క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని నునపర్తి గ్రామంలో శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న 9వ ఆంధ్ర రాష్ట్ర జూనియర్ అండర్-19 అంతర్ జిల్లాల బాలబాలికల బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ పరిచయం చేసుకున్నారు. క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో మారుమూల గ్రామమైన నునపర్తిలో ఇటువంటి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ నిర్వాహకులను ఆయన అభినందించారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం

ప్రజాశక్తి-యలమంచిలి : రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని ఇళ్లులేని నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, అందుకు తగిన కార్యాచరణ రూపకల్పన చేస్తోందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు అన్నారు. యలమంచిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు పప్పల చలపతిరావును ఆదివారం సాయంత్రం తాతయ్యబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను సలహాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ పార్టీ కార్యదర్శి ఆడారి రమణబాబు, నాయకులు ధూళి రంగనాయకులు, ఆడారి ఆదిమూర్తి, సురకాసుల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.


తాతయ్యబాబును సత్కరిస్తున్న టిడిపి నాయకులు

వడ్డాది సంతలో కూరగాయలు అమ్ముతున్న దృశ్యం

పెరిగిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి-వడ్డాది : కూరగాయలు భారీగా పెరిగాయి. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో ఆదివారం నిర్వహించిన వారపు సంతలో టమాట, బీన్స్, చిక్కుడు ధరలు వినియోగదారులను హడలెత్తించాయి. టమాటా కేజీ రూ.100, కాగా, చిక్కుడుకాయలు, బీన్స్ రూ.120, వంకాయ, బెండకాయ, బీరకాయ, దొండకాయలు రూ.80, ఉల్లిపాయలు కేజీ రూ.60 చొప్పున విక్రయించారు. దీంతో వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేయడానికి ఇబ్బంది పడ్డారు. బంగాళాదుంపలు మినహా అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగిపోయాయని వాపోయారు. దిగుబడులు తగ్గడం, ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ పెరగడంతో ఈ పరిస్థితి నెలకొందని వ్యాపారులు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో డిపిఎన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : విజయవాడ రూరల్ మండలం అశోక ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన 68వ అంతర జిల్లాల రెజ్లింగ్ (కుస్తీ) పోటీలలో కశింకోట డిపిఎన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్ -17 బాలుర గ్రీకో -రోమన్ స్టైల్‌లో కె.అఖిల్ 60 కిలోల విభాగంలో రజత పతకం, పి.రోహిత్ 51 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వి.ప్రభాకరావు తెలిపారు. ప్రతిభ సాధించిన ఇద్దరి విద్యార్థులకు ఎంఆర్‌వి.అప్పారావు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆచంట రవి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన అఖిల్, రోహిత్

కొండకర్ల ఆవలో ఎస్పీ దంపతుల బోటు షికారు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని కొండకర్ల ఆవలో ఆదివారం అనకాపల్లి ఎస్పీ దీపిక, ఆమె భర్త కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్ తమ కుటుంబీకులతో బోటు షికారు చేశారు. ఆవలో అందాలను తిలకించారు. ప్రకృతి సిద్ధంగా రంగు రంగుల పక్షులు, నీటిలో చేపలు, కలువ పువ్వులు, తామర ఆకులు వంటి వాటిని చూసి ఆనందంగా గడిపారు.

కొండకర్ల ఆవలో బోటుపై షికారు చేస్తున్న ఎస్పి దీపిక దంపతులు

బిసి గర్జనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- అనకాపల్లి

బిసి కుల, జన గణన చేయాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఈ నెల 9వ తేదీన జరుగు బిసి గర్జనను విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి ఇంచార్జ్ సూదికొండ మాణిక్యాలరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం అనకాపల్లిలో వలువురు బిసి సంఘాల నేతలను కలిసి బీసీ గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను అందించారు. బీసీ కులాల ప్రజల వాస్తవ సంఖ్యను గుర్తించి తద్వారా రాజ్యాంగం అందిస్తున్న రిజర్వేషన్ ఫలాలు బీసీలకు దక్కవలసిన వాటా పొందేందుకుగాను ఈ గర్జన సభలో తెలియజేయడం జరుగుతుందని చెప్పారు. బీసీ కుల జన గణన తప్పక జరగాలని అందుకోసం బీసీ కులాలు అన్ని ఏకతాటి మీదకు వచ్చి పోరాడవలసిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో బిఎస్పి నాయకులు వనమాల నాగభూషణం పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నాటికలు

మూల్యం నాటికలోని ఓ సన్నివేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

దసరా నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా అనకాపల్లి గవరపాలెం శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం వారి ఆధ్వర్యంలో శ్రీగౌరీ సేవా సంఘం మల్ల జగన్నాథం కళ్యాణ మండపంలో జరుగుతున్న కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు ప్రేక్షకుల నుండి విశేష ఆకట్టుకుంటున్నాయి. మూడో రోజు ఆదివారం కరీంనగర్ చైతన్య భారతి వారి "స్వప్నం" రాల్చిన అమృతం, హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారి "మూల్యం" నాటికలను ప్రదర్శించారు. మొదటి నాటిక స్వప్నం రాల్చిన అమృతం మూల కథ పిఎస్ నారాయణ, నాటకీకరణ రచన పరమాత్ముని శివరాం రాయగా, రమేష్ మంచాల దర్శకత్వం వహించారు. నాటిక సంగ్రహంగా.. ఒక కాకికి దెబ్బ తగిలితే సంఘీభావంగా అనేక కాకులు అరుస్తూ వాటి మధ్య ఎటువంటి బంధాలు అనుబంధాలు లేకపోయినా సానుభూతిని వ్యక్తం చేస్తాయి. అటువంటిది భార్యాభర్తల బంధానికి అనుబంధానికి విలువ నిచ్చే మనుషులం.... ఆ కాకుల్లో ఉన్న కనీస జ్ఞానం మనకు లేకపోతే ఎలా అని తెలియజేప్పేదే ఈ నాటిక సారాంశం. ఇక రెండవ నాటికగా ప్రదర్శించిన మూల్యం రచన శ్రీసింహప్రసాద్, దర్శకత్వం డాక్టర్ వెంకట్ గోవాడ వహించారు. దీని సారాంశం క్లుప్తంగా నేడు సమాజంలో మహిళలు చిన్ననాటి నుంచి పెద్దయ్యే వరకు రకరకాల వివక్షతలకు గురవుతూ వస్తున్నారు. చదువు, ఉద్యోగం, స్వేచ్ఛ, దృష్టి దక్పథం అన్నింట వివక్షే. దీంతో పాటు వివాహం కాగానే సర్వాధికారాలు భర్తకు వర్తిస్తాయి అన్నట్లు, సాటి మనిషిగా గుర్తించి గౌరవించకపోవడం నిజంగా అమానుషమే. మగవారితో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడుతూ విజయ బావుటా ఎగరవేసే మహిళా శక్తిని కించపరచడమే. లింగ అసమానతను, హక్కుల హననాన్ని ఒక మహిళ శంఖారావం పూరించి ఎలా సాధిస్తుందో తెలియచెప్పేదే మూల్యం కథ సారాంశం. రెండు నాటికలు నేటి సమాజంలో అడుగడుగునా కనిపిస్తున్న అసమానతలకు అద్దం పట్టాయి. కర్రి సన్యాసినాయుడు, శివ శాశ్వత ఆర్థిక ప్రోత్సాహంతో జరుగుతున్న ఈ నాటకోత్సవాలకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

విశాఖ లేబర్ ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చలు విఫలం

-16 వరకు నిరసనలు కొనసాగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు కనీస వేతనం అమలు చేయాలని, బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని తదితర సమస్యలపై 46 రోజులుగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఆదివారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై విశాఖపట్నం అక్కయ్య పాలెంలో ఉన్న జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (జెసిఎల్) సునీత సమక్షంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడోట ప్రకాష్ ఆధ్వర్యంలో ఆసుపత్రి కార్మిక సంఘం ప్రతినిధులు, సంబంధిత కాంట్రాక్టర్లతో చర్చలు జరిగాయి. కార్మికులు కనీస వేతనం, ఇతర సమస్యలపై కాంట్రాక్టర్లు, సంఘం ప్రతినిధుల మధ్య అంగీకారం కుదరకపోవడంతో తిరిగి సమావేశం ఈ నెల 15వ తేదీకి జాయింట్ కమిషనర్ వాయిదా వేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడోట ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని, అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే 16వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ బుగత అశోక్, కోన లక్ష్మణ, ఆర్‌విఎస్ కుమార్, పడాల గోవింద్, జిల్లాలో వివిధ ఆసుపత్రుల సంఘం ప్రతినిధులు వర ప్రసాద్, కిరణ్, భవాని, కుమారి, లక్ష్మి, నూక రత్నం, సత్యవతి, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

జలగల మధుం రహదారికి మోక్షం

ప్రజాశక్తి-అనకాపల్లి

కొన్నేళ్లుగా అనకాపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లే దారిలో సుంకరమెట్ట నుంచి డైట్ కళాశాల జంక్షన్ వరకు రహదారిలో పెట్రోల్ బంకు యాజమాన్యం టిడిఆర్‌లు ఇవ్వకపోవడంతో ఆటంకం పరచడంతో కొంత భాగం వేయకుండా వదిలేశారు. దీంతో ఈ రోడ్లో పెద్దపెద్ద గోతులు పడి వాహనాలు రాకపోకలు సాగించే అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్యను స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందించి పెట్రోల్ బంకు యాజమాన్యంతో చర్చలు జరిపి తన సొంత హామీపై యాజమాన్యానికి న్యాయం చేసేందుకు ఒప్పుకొనడంతో ఈ రహదారికి మోక్షం కలిగింది. దీంతో ఆదివారం తారురోడ్డు నిర్మాణాలను 84వ వార్డు టిడిపి ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు దగ్గరుండి రోడ్డు పనులను పర్యవేక్షించారు. ఎంతోకాలంగా రోడ్డు నిర్మాణం పనులు ఆగిపోవడంతో రెండు పర్లాంగులు రోడ్డు నుండి వెళ్లడానికి ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారని, ప్రమాదాలు కూడా జరిగేవని, ఎట్టకేలకు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సమస్యను పరిష్కరించినందుకు స్థానిక కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న టిడిపి నేత నీలబాబు

గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యాన మొక్కల నాటివేత

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలోని నందనవనం (నూకాంబిక నగర్ రోడ్డు) క్రరి వారి వీధిలో నందనవనం అధ్యక్షులు మురళి, కాలనీవాసుల ఆధ్వర్యాన ఆదివారం జామ, పనస, వేప, కానుగ, వాటర్ యాపిల్, కదంబ, అశోక, మారేడు, ఉసిరి, బాదం వంటి 81 మొక్కలు నాటారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయని బృందం, నందనవనం కాలనీ వాసులతో కలిసి వీటిని నాటారు. అనంతరం పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. కాండ్రేగుల నూక అప్పారావును, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాస్టర్‌ను కాలనీవాసులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నందనవనం అధ్యక్షులు పోలమరశెట్టి వెంకట్, కార్యదర్శి క్రరి పూర్ణచంద్రరావు, సహాయ కార్యదర్శి కోయిలాడ వినయ్ కుమార్, కోశాధికారి కాండ్రేగుల శివాజీ, విల్లూరి రాఘవ గణేష్, బుద్ధ జయబాబు, కోరిబిల్లి నూకరాజు, కోరిబిల్లి నరసింగరావు, జగన్నాధరావు, క్రరి సురేష్, కొణతాల మోహనరావు, పోలమరశెట్టి యుగంధర్, భీమరశెట్టి నరేష్, కాండ్రేగుల వాసు, కాండ్రేగుల భాస్కరరావు, బొడ్డేడ కాశి, కాండ్రేగుల జనార్దన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న గ్రీన్ క్లబ్ ప్రతినిధులు, ప్రజలు

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

మునగపాకలో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మునగపాక

మునగపాక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనకాపల్లి భువనేశ్వరి కంటి ఆసుపత్రి వైద్య బృందం నిర్వహించిన ఈ శిబిరంలో 200 మందికి నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కంటి చూపు మందగించిన వారికి తక్కువ ధరలకే కళ్లద్దాలను అందచేసినట్లుగా సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎన్ నరసింహమూర్తి, ఎల్ ఎస్ మిత్రా, రామచంద్రరావు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు : శంకర్ ఫౌండేషన్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరానికి నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మంది కంటి రోగులకు చికిత్స అందించారు. శంకర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ అశ్విని కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ హరిచందన, నర్సింగ్ స్టాఫ్ రేణుక తదితరులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 30 మంది రోగులకు కంటి ఆపరేషన్ అవసరం కాగా వీరందరినీ శంకర్ ఫౌండేషన్ బస్సులో తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందని కోఆర్డినేటర్ తెలిపారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు.

కె.కోటపాడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- డిసిసి అధ్యక్షుడు సుబ్బన్న

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న అన్నారు. మండలంలోని రాజాం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న తన మిత్రుడు, మాజీ సర్పంచ్ నాగులాపల్లి సత్యనారాయణను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హర్యానా, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. 2029 నాటికి ఏపీలో కూడా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఏపీకి భవిష్యత్తు ఉంటుందన్నారు. పోలవరం నిర్మాణం, విభజన హామీలు అమలు, రైల్వే జోన్, ప్రత్యేక హోదా, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు.

నేటికీ ఎస్సీ, ఎస్టీలు పేదలుగానే ఉన్నారు

కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎస్‌సి, ఎస్‌టిలు నేటికీ పేదలుగానే ఉన్నారని ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గరికిముక్కు సుబ్బయ్య అన్నారు. స్థానిక విజయరామరాజుపేటలో గల మాధవ సదన్ హాలులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో శతాబ్దాలుగా షెడ్యూల్ కులాలవారు అంటరానితనానికి అస్పృశ్యతకు గురయ్యారని తెలిపారు. సామాజిక సమానత్వం, ఆర్థికాభివృద్ధి కొరకు భారత రాజ్యాంగంలో వారికి ప్రత్యేక హక్కులను రిజర్వేషన్లను కల్పించినట్లు చెప్పారు. షెడ్యూల్ కులాల నుండి క్రైస్తవ మతం మారిన వారిని బీసీ 'సి'లుగా గుర్తించాలన్నారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని గౌరవించి నిజమైన దళితుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బోని గణేష్, ప్రధాన కార్యదర్శిగా మైలపల్లి పోతురాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా గంగాధర్ మరియమ్మ యోగిరాజు, కార్యదర్శులుగా కొల్లి చినప్పారావు, కోన అప్పారావు, దొమ్మంగి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా జల్లూరి రామకృష్ణ, గాడి ప్రసాద్, గుమ్మాల అమ్మ తల్లి, నేతల సోమేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కారు అప్పారావు, కోరిబిల్లి జగదీష్, పతివాడ పవన్, సత్యాడకాలి బండ క్రాంతి, ఓలుమరక ఈశ్వరరావు, సర్మండ లవరాజు, పొన్నపురాజు ఎన్నికయ్యారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఒకటో యూనిట్ మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అభిరామ కంపెనీ ఇంజనీర్లను సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ఆదేశించారు. స్థానిక జల విద్యుత్ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించి నెంబర్ వన్ యూనిట్ మరమ్మతు పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జల విద్యుత్ కేంద్రంలో ఏపీ జెన్కో ఈఈ రాజేంద్రప్రసాద్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డితో సమావేశమయ్యారు. యూనిట్లు పనితీరు విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై చర్చించారు. ఇక్కడి నుంచి ఇంజనీర్లు బదిలీలు జరుగుతున్నాయని వారి స్థానంలో రిలీవర్లు రావడం లేదని చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు దృష్టికి ఇంజనీర్లు తీసుకొచ్చారు.

తంతడి తీరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని తంతడి సముద్రతీరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక తయారు చేస్తామని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. తంతడి బీచ్‌లో ఆదివారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంతడిలో పర్యాటకులను ఆకర్షించే విధంగా కొండ, విశాలమైన సముద్ర తీరం ఉందని తెలిపారు. ఇక్కడ సినిమా షూటింగ్‌లు, వీడియో ఫిల్ములు తీయడానికి అనుకూలంగా ఉందని చెప్పారు. పర్యాటకంగా ఆకర్షణ అవుతున్న ఈ తీరాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మండల అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, రాజాన నానాజీ, రాజాన అప్పారావు, రాజాన సన్యాసినాయుడు, జనసేన మండల అధ్యక్షులు బి రాందాస్, నునపర్తి సర్పంచ్ చుక్క అనురాధ, మత్స్యకారులు పాల్గొన్నారు.

తంతడి సముద్ర తీరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

క్వారీ వాహనాలతో రోడ్డు ఛిద్రం

-ఎగిసిపడుతున్న ధుమ్ము, ధూళి -అవస్థలు పడుతున్న పలు గ్రామాల ప్రజలు

క్వారీ లారీ వెళుతుండగా వెలువడుతున్న ధుమ్ము, ధూళి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో రాజుపేట గ్రామానికి వెళ్లే రహదారి క్వారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా ధ్వంసమైంది. క్వారీ వాహనాలతో ఒకవైపు గోతులు, మరోవైపు దుమ్ము ధూళితో కైలాసపట్నం నుండి రాజుపేట, రామన్నపాలెం, మాకవరపాలెం మండలం జంగాలపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. పిల్లల నుండి వృద్ధుల వరకు దుమ్ము, ధూళితో అనారోగ్యం బారిన పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో ఇటు విద్యా కేంద్రం నర్సీపట్నం, పాయకరావుపేట వచ్చే ప్రయాణికులు అటు మాకవరపాలెం, ఇంజనీరింగ్ చదువుకునే విద్యార్థులు సహా విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు రోడ్డుపై ప్రయాణించడమంటేనే భయ పడుతున్నారు. కోటవురట్ల రెవెన్యూ పరిధిలో రాళ్లగుట్ట నుండి నిబంధనలు అధిగమించి నల్ల పిక్క క్వారీ లారీలు భారీ వాహనాలతో ఇష్టారాజ్యంగా నడుపుతూవున్నా గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. భారీ వాహనాలు మితిమీరిన వేగంతో రోడ్డుపై వెళ్లడంతో దుమ్ము దూళీ ఎగిసిపడుతుంది. ధూళి పీల్చడంతో ఊపిరితిత్తుల సమస్యలతో పలు అనారోగ్య పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయా ప్రాంతాల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామన్నపాలెం గ్రామం నుంచి కైలాసపట్నం వచ్చే వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఎదురుగా లారీ వెళ్తే 15నిమిషాల పాటు దుమ్ము, ధూళి గాలిలో నిలిచి ఉండిపోతుంది. దీంతో, లారీ వెనక వెళ్లే ప్రయాణికులు తీవ్రమైన అవస్థలు పడుతున్నారు.సమీప ప్రాంతంలో ఎక్కువమంది రైతులు కావడంతో పొలాలలో పని చేసుకునే వారికి సైతం ఈ ధూళి బెడద తప్పడం లేదు. పశు గ్రాసంపై దుమ్ము పేరుకు పోవడంతో పశువులు తిన లేని పరిస్థితి నెలకొంటుంది. రోడ్డుపై భారీ వాహనాలతో గోతులు పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్వారీ వాహనాలపై పలుమార్లు ఆయా ప్రాంతాల వాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదని పలు విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. భారీ వాహనాలతో రోడ్డుపై ప్రయాణించే వారికే కాకుండా సమీప ప్రాంతంలో ఇంటిలోపలి తలుపులన్నీ వేసినా దుమ్ము దూళి ప్రవేశించడంతో అవస్థలు పడుతున్నామని గృహిణులు సైతం ఆవేదన చెందుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ధూళి సమస్యతో అనారోగ్యం పాలవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కూటమి నాయకులు ఇప్పటికైనా స్పందించి క్వారీ వాహనాలను నిలిపివేయాలని పలు గ్రామాల ప్రజలు కోరారు.

చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పుస్తకాలు చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం అలవాటు చేసుకోవాలన్నారు.

ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవములు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం బ్రహ్మోత్స వాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు శేషాచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను సప్పరం వాహనంలో అధిష్టింపజేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు,భక్తులు పాల్గొన్నారు.

8న జాబ్ మేళా

ప్రజాశక్తి-చింతపల్లి:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి, సీడాప్ సంస్థల ఆధ్వర్యంలో స్థానిక యువసేన కేంద్రం (వై టి సి) వద్ద ఈనెల 8న ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా "అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్ పోర్ట్స్, కేర్ ఫర్ యు, ఇతర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. జిల్లాలోని 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, ఆపై చదువు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూకు పాన్ కార్డు, ఆధార్ కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం రూ.10 వేల నుండి 20 వేల వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

మోదకొండమ్మను దర్శించుకున్న కలెక్టర్ దంపతులు

ప్రజాశక్తి-పాడేరు : జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తన సతీమణి అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌తో కలిసి ఆదివారం మోదకొండమ్మ అమ్మవారిని దర్శిం చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు.

కలెక్టర్ దంపతులకు జ్ఞాపికను ఇస్తున్న కమిటీ సభ్యులు

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ గ్రామంలో వినాయకుని గుడి, ఎస్సీ కాలనీలో తాగునీటి బోరు నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ కనిపల్లి అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ నిధుల నుంచి ఈ రెండు బోర్లను వేయడం జరుగుతుందన్నారు. ఈ బోర్ల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కె.లక్ష్మీనారాయణ, స్థానిక టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ పారేపల్లి నాగేశ్వరరావు, పుల్లేటికుర్తి రమేష్, గండేపల్లి రాము, పోతిన లోవరాజు, జనసేన నాయకులు బట్ట గణేష్, పండా శ్రీనివాసరావు, పండ ప్రసాద్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా జల్ జీవన్ మిషన్ పనులు

పైప్‌లైన్‌కు మట్టిని వదివేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాలలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా చేయడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రాజుపేట గ్రామంలో దాదాపు 70 లక్షలతో చేపట్టిన పైపులైను పనులు అస్తవ్యస్తంగా చేయడంపై సర్పంచ్ వెంకటరమణ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చేపట్టిన పనులు అన్నీ చోట్ల లీకేజీలు ఉండటం, చేపట్టిన పనుల కోసం ఇష్టానుసారంగా ధ్వంసం చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికోసం పంచాయతీ నుంచి సొంత నిధులు ఖర్చు చేసి తిరిగి మరమ్మతులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ట్యాంకు వాల్వు వద్ద అసంపూర్తిగా వదిలి వేయడంతో వర్షపు నీరు నిల్వ ఉండిపోతుంది. కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో అధికారులకు చెప్పి చెప్పి విసుకు చెంది చేతి చమురు విధించుకుంటున్నామని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. జల జీవన్ పనులతో రోడ్లన్నీ ధ్వంసం చేయడంతో నడిచి వెళ్లేందుకు సైతం అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి ధ్వంసం చేసిన రోడ్లను మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు సమీపాన తవ్వి వదిలేసిన దృశ్యం

పథకాల వివరాలు తెలియజేయాలి

ప్రజాశక్తి- పెదబయలు: ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని జనసేన పార్టీ పెదబయలు మండల వర్కింగ్ కమిటీ ఇన్చార్జి కొండలరావు (కార్తీక్) ఆదివారం పార్టీ శ్రేణులకు సూచించారు. పెదబయలు జిల్లా పరిషత్ మైదానంలో నిర్వహించిన పంచాయితీల ఇంచార్జీల నియామక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మండలంలో జనసేనా పార్టీ బలోపేతానికి కమిటీలు క్షేత్రస్థాయిలో పని చేయాలని ఆకాంక్షించారు. మండల అధ్యక్షులు కిల్లో బాబురావు, ఉప అధ్యక్షులు పవన్ పాల్గొన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-ఏంవిపి కాలనీ:రాష్ట్ర పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేలా నవంబర్‌లో టూరిజం పాలసీ విడుదల చేస్తామని, ఏప్రిల్ 2025 నుండి పాలసీ అమల్లోకి రానుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం విశాఖపట్నంలోని సర్క్యూట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి టూరిజం పాలసీకి సంబంధించి పలు అంశాలు వివరించారు. పర్యాటకులను ఆకర్షించేలా స్టేక్ హోల్డర్లకు అనుకూలంగా ఉండేలా పాలసీ రూపకల్పనకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రత్యేక సహకారం అందించేందుకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి ముందుకు వచ్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా టెంపుల్ టూరిజాన్ని, స్వదేశీ దర్శన్ ద్వారా ఎకో, అడ్వెంచర్ టూరిజం అభివృద్ధి చేయనున్నామని వెల్లడించారు. టెంపుల్ టూరిజంలో భాగంగా నంద్యాల జిల్లా శ్రీశైలం, బాపట్ల జిల్లా సూర్యలంక, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను కలుపుతూ అఖండ గోదావరి, నంద్యాల జిల్లా సంగమేశ్వరం పరిసర ప్రాంతాల్లో ఐకానిక్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. టూరిజం సర్క్యూట్లు ఏర్పాటు చేసి, ఆహ్లాదకరమైన వాతావరణంలో రిసార్టులు, ఇతర వసతి సౌకర్యాలు, మౌలిక సదుపాయలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొంది స్తున్నామన్నారు. టూరిజం పాలసీ ద్వారా పర్యాటక ప్రాంతాల్లో సరైన సదుపాయాల కల్పన, ముందుకు వచ్చే పెట్టుబడిదారులకు రాయితీలు, వారిని ఆకర్షించేలా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్ నర్ షిప్ అందించాలని సిఎం సూచించారన్నారు. రూ.500 కోట్లతో ఏపీలోని అమరావతిలో మెగా ప్రాజెక్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. దక్షిణ భారతదేశంలోనే నెంబర్ 1 గోల్ఫ్ కోర్స్ ఏపీలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాలు, అక్రమాలతో పర్యాటక రంగం కుంటుపడిందని విమర్శించారు. కోస్టల్ రెగ్యులేషన్ జోన్, అటవీ శాఖ అనుమతులతో ఎంవీ మా షిప్ ను అందుబాటులోకి తెస్తామన్నారు. టూరిజంపై లఘు చిత్రాల ద్వారా అవగాహన, ఆసక్తి కల్పిస్తామన్నారు. జనవరిలో విశాఖ ఉత్సవ్, బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు చర్యలు చేపడతామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించిన డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి-గొలుగొండ:కొత్త మద్యం పాలసీ పర్యవేక్షణ జిల్లా అధికారి. ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి గొలుగొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ స్టేషన్ పరిధిలో ఉన్న రెండు మండలాలు గొలుగొండ, నాతవరంలో ఎనిమిది షాపులకు దరఖాస్తు స్వీకరణపై సూచనలు, సలహాలు అందజేశారు. ఈ మద్యం షాపులకు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నమోదు చేయుటకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉందన్నారు. అప్లికేషన్ ఫీజు 2లక్షలుగా నిర్ణయించారన్నారు. దరఖాస్తుదారులకు లాటరీ విధానం ద్వారా సెలెక్ట్ చేయడం జరుగుతుందన్నారు. 11వ తేదీ ఉదయం 8 గంటలకు అనకాపల్లి ఉప్పల చంద్రశేఖర్ కళ్యాణ మండపం వద్ద జరుగుతుందన్నారు. ఆయన వెంట గొలుగొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బి.మధుకుమార్ ఉన్నారు.

రోడ్లు, బ్రిడ్జి పనులపై ప్రభుత్వం దృష్టి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: గత ప్రభుత్వం నిర్లక్ష్యం వదిలేసిన రోడ్లు, బ్రిడ్జి పనులను కూటమి ప్రభుత్వం చేపడుతుందని జనసేన పార్టీ నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ తెలిపారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, మున్సిపాలిటీలో 90 అడుగుల రోడ్డు, 30 అడుగుల రోడ్డుపై మాజీ ఎమ్మెల్యే గణేష్ ప్రస్తావించారని, ఈ రోడ్డ కోసం రూ.3.15కోట్లతో పనులు చేయించామని చెబుతున్నారన్నారు. ఈ రెండు రోడ్లకు సంబంధించి రూ.3.15కోట్లకు గాను ఒక్క రూపాయి కూడా వైసిపి ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ఈ నిధులను కూటమి ప్రభుత్వమే చెల్లిస్తుందని గుర్తు చేశారు. కోటవురట్ల మండలం జల్లూరు బ్రిడ్జి 80 శాతం పూర్తయితే వైసీపీ హయాంలో ఒక్క ఇటుక కూడా పెట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జల్లూరు బ్రిడ్జి పనులు వేగవంతమయ్యాయన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాజా, చల్లా చిట్టిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఇసుక సరఫరాకు చర్యలు

-జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:జిల్లాలో అవసరాలకు సరిపడా ఇసుక సరఫరా చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈస్ట్ గోదావరి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని ఇసుక రీచ్‌లకు అనుసంధానం చేస్తూ నిర్ణయం చేయడం జరిగిందన్నారు. రోజుకు జిల్లాలో 3 వేల టన్నుల డిమాండ్ ఉండగా,వివిధ జిల్లాల్లో గుర్తించిన ఇసుక రీచ్ ల ద్వారా సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఇసుక అక్రమ రవాణా, క్రయ విక్రయాలపై నిఘా ఉంచేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రిటైల్ కొనుగోలుదారులకు బుక్ చేసుకున్న ఒక్క రోజుల్లోనే ఇసుక సరఫరా చేసినట్లు తెలిపారు. ఆన్ లైన్ లో 442 టోకెన్ లు జనరేట్ కాగా 357 డెలివరీలు చేశామన్నారు. సుమారు 7 వేల మెట్రిక్ టన్నులు అందజేసినట్లు చెప్పారు.బల్క్ బుకింగ్ చేసుకున్న వారికి సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఒకటి రెండు రోజుల్లో ఇసుక అందిస్తామన్నారు.సమస్యలు,ఫిర్యాదుల పరిష్కారం కొరకు హెల్ప్ డెస్క్, ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 0891 2590100 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో జిల్లా అవసరాలకు మించి ఈ నెల 15 నుంచి ఇసుక సరఫరా జరుగుతుందన్నారు. 24/7 ఆన్లైన్ విధానంలో ఇసుక బుకింగ్ కు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని,ఇందుకోసం సచివాలయం, ఇతర కార్యాలయాల్లో సిబ్బందికి శిక్షణ అందించామన్నారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

కాఫీ కొనుగోలుకు జిసిసి సన్నద్ధం

- జిసిసి ఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఏజెన్సీలో ఈ ఏడాది గిరిజన రైతుల నుంచి జిసిసి ద్వారా కాఫీ కొనుగోళ్లకు చర్యలు చేపట్టామని పాడేరు బ్రాంచ్ గిరిజన ప్రైమరీ కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (జి పి సి ఎం ఎస్) మేనేజర్ బుక్క వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన "ప్రజాశక్తి"తో మాట్లాడుతూ తమ సొసైటీ పరిధిలోని పాడేరు హుకుంపేట మండలాల్లో 159 గ్రామాల్లో కాఫీ దిగుబడి చేస్తున్న గిరిజన రైతుల నుంచి కాఫీ పార్చ్ మెంట్, చెర్రీ రకాల కాఫీ కొనుగోళ్లకు 15 మంది సిబ్బందిని సన్నద్ధం చేసామని చెప్పారు. పూలింగ్ అసిస్టెంట్లు, సేల్స్‌మెన్లకు బాధ్యతలు అప్పగించామని చెప్పారు. రైతుల నుంచి నాణ్యమైన కాఫీని సేకరించేందుకు ఇప్పటి నుంచే గ్రామాల్లో రైతుల సమావేశాలు ఏర్పాటు చేసి చైతన్య పరుస్తూ కాఫీ అమ్మకాలకు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కాఫీ సేకరణ కోసం గ్రామాలకు వెళ్లి కొనుగోలు చేసే సిబ్బందికి వాహనాలు కూడా సమకూరుస్తున్నామని చెప్పారు ముఖ్యంగా కాఫీ మాయిశ్చరైజింగ్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, దీంతో మార్కెట్లో అల్లూరి, మన్యం కాఫీకి మంచి డిమాండ్ తో పాటు ధర లభిస్తుందని చెప్పారు. తమ సొసైటీ పరిధిలోని ఈ రెండు మండలాల్లో 2340 మంది కాఫీ రైతులు ఉన్నారని, ఈ ఏడాది సుమారు 900 మెట్రిక్ టన్నులు కాఫీ దిగుబడి జరుగుతుందని, ఈ మేరకు పాడేరు మండలంలో 250, హుకుంపేట మండలంలో 200 మెట్రిక్ టన్నులు కాఫీ కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు.

పచ్చదనం పెంపులో 'క్రెడాయ్' కృషి అభినందనీయం

మొక్కలను కొనుగోలు చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:పర్యావరణ పరిరక్షణతో పాటు అడవులు విస్తారంగా పెరగాలన్న సదుద్దేశ్యంతో 'క్రెడాయ్' మరో మంచి పని చేసింది. వైజాగ్ రన్నర్స్ అనే సంస్థతో కలిసి క్రెడాయ్ వైజాగ్ చాప్టర్ సభ్యులు ఆదివారం తొట్లకొండపై నుంచి సీడ్‌బాల్స్ వేసింది. సామాజిక భద్రతా బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా పచ్చదనం పెంపుకోసం ఇలా చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి శాంతి స్వరూప్ మాట్లాడుతూ, ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండగా, వాతావరణ సమతుల్యత కోసం ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కార్యక్రమాల్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తొట్లకొండ పరిసర ప్రాంతాల్లో మొక్కలు విస్తారంగా పెంచాలని, జీవ వైవిధ్యం (బయో డైవర్సిటీ) పెంపొందాలనే ఉద్దేశ్యం అందరిలోనూ రావాలని సభ్యులు ఆకాంక్షించారు. పచ్చదనం పెంపునకు పౌరులు ముందుకు రావాలని,భవిష్యత్ తరాల్ని దృష్టిలో పెట్టుకుని పట్టణీకరణ ప్రాంతాల్లో గ్రీనరీ కనిపించేలా చేయాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. కెడాయ్ చైర్మన్ కె.యస్.ఆర్.కె. రాజు (సాయి), ప్రెసిడెంట్ వరద ధర్మేందర్, కార్యదర్శి వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు, బాధిత రైతులు

భూ ఆక్రమణలపై ధర్నా

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రం లోని టీచర్ భూ ఆక్రమాలను వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సైని సత్తిబాబు, ఆధ్వర్యంలో అఖిల పక్ష పార్టీల ప్రజాప్రతినిధులు పరిశీలించారు.బాధిత రైతులతో కలిసి ఆదివారం ఆందోళన చేపట్టారు. తక్షణమే రైతుల భూములను వారికే ఇప్పించాలని డిమాండ్ చేశారు.33 ఎకరాల పైబడి ఓ టీచర్ అక్రమాలు రెవెన్యూ అధికారులు సహకారంతోనే కోట్ల రూపాయల భూముల కబ్జా జరిగిందని ఆరోపించారు. ఇకనైనా సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోమేలి లక్ష్మయ్య, కూటమి నాయకులు బొడ్డా శ్యామ్, పాంగి వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు పాంగి చిరంజీవి, కోటిబాబు, వార్డ్ మెంబర్ కొర్ర నాగబాబు, భూ బాధిత రైతులు బొర్రా రాజు , భాగ్య, గుమ్మడి పార్వతమ్మ, శోభ సుభద్ర, కొండపల్లి సూరిబాబు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- పెదబయలు:సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామంలో ఆదివారం సిసి రోడ్డు పనులను సర్పంచి పి.మాధవరావు, ఆదివాసి గిరిజన సంఘం పూర్వ అధ్యక్షుడు బోండా సన్ని బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 6 వార్డు మెంబర్ వెంకటరావు, మాజీ ఎంపిపి కొండయ్య, గ్రామ పెద్ద రామానాయుడు పాల్గొన్నారు

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు